
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
సోమవారం 27 అక్టోబరు 2025




క్యూలో భక్తులు, స్వామివారికి అభిషేకం చేస్తున్న ఆలయ నిర్వాహకులు, అర్చకులు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


శివలింగానికి అభిషేకం

కీసరగుట్టలో కార్తీక శోభ

వన భోజనాలతో సందడి చేసిన భక్తులు

ఘనంగా రామలింగేశ్వరుడికి పాలాభిషేకం

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కీసరగుట్ట రామలింగేశ్వర ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్ల వారుజామున గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అభిషేకాలు, అర్చనలకు అనుమతించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారిని, వామ భాగంలో ఉన్న అమ్మవార్లను, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శివ పంచాయతనం, శ్రీసీతారామచంద్రస్వామి వార్లను దర్శించుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కీసరవాణి వద్ద కార్తీక వన భోజనాలు చేసి ఆట, పాటలతో సందడి చేశారు.

కీసర, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి)



టెన్నిస్ వాలీబాల్ జట్టు కెప్టెన్‌గా నిఖిల్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిపల్లిగూడకు చెందిన చిలుగూరి నిఖిల్ తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ వాలీబాల్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. వచ్చే నెల 14 నుంచి 16 వరకు న్యూ ఢిల్లీలో జరగనున్న 27వ సీనియర్ నేషనల్స్ టెన్నిస్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టుకు నిఖిల్ ప్రాతినిధ్యం వహించనున్నారు. జట్టుకు వివిధ జిల్లాల నుంచి పది మంది క్రీడాకారులను ఎంపిక చేయగా నిఖిల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని తెలంగాణ టెన్నిస్ వాలీబాల్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎ.బాల్‌రాజ్, కార్యదర్శి శివశంకర ప్రసాద్ తెలిపారు. దీంతో గ్రామంలో ఆయా యువజన సంఘాల నాయకులు, కోచ్‌లు ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీధర్, గూడెపు మహేందర్ నిఖిల్‌ను అభినందించారు.



వికారాబాద్‌లో మోస్తరు వర్షం

వికారాబాద్/ధారూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో కూడా మోస్తరు వర్షం కురవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఒక వైపు ఎండ కొడుతూనే మరో వైపు వర్షం కురిసింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు వర్షంతో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణం చల్లబడి కన్పించింది. ఇక ధారూరులో మధ్యాహ్నం వరకు పొడిగా ఉన్న వాతావరణం ఒక్కసారి మారిపోయి మేఘావృతమై కొద్దిసేపు చిరు జల్లులు కురిసాయి. వర్షాలతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట తడిసి పాడైపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమీక్ష

మేడ్చల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే ఈ సమావేశంలో పీవోఏ యాక్ట్ విక్టిమ్స్ కంపన్సేషన్, పునరావాసం కల్పన అంశాలపై చర్చిస్తారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్లపై సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మను చౌదరితోపాటు ఎస్సీ, ఎస్టీ శాఖల జిల్లా అధికారులు హాజరుకానున్నారు.

లక్కునోళ్లకే కిక్కు!



ఆశల పల్లకీలో టెండర్‌దారులు

మద్యం దుకాణాలకు దరఖాస్తు ప్రక్రియ ముగియగా, నేడు అదృష్టవంతులు ఎవరనేది తేలనుంది. వికారాబాద్ జెడ్పీ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ భవన్‌లో మద్యం షాపులకు లక్కీ డ్రా తీయనున్నారు. దీనికోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ లక్కీ డ్రా ప్రారంభిస్తారు. గెజిట్ నంబర్ల వారీగా ఒక్కో షాపునకు వచ్చిన దరఖాస్తుల ఆధారంగా డ్రా తీసి ఎంపికైన వారి పేరును ప్రకటిస్తారు. రెండేళ్ల కాలానికి లైసెన్స్ జారీ చేస్తారు. తమకు అదృష్టం వరిస్తుందో, లేదోనని టెండర్‌దారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

59 మద్యం దుకాణాలకు 1,808 దరఖాస్తులు

అత్యధికంగా నవాబ్‌పేట వైన్స్‌కు 65 మంది పోటీ

అత్యల్పంగా బాగాయిపల్లి షాపునకు 15 మంది

నేడు లక్కీడ్రా.. అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాట్లు పూర్తి

వికారాబాద్/మేడ్చల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త మద్యం పాలసీ 2025-27కు సంబంధించి జిల్లాలోని 59 మద్యం దుకాణాలకు 1,808 దరఖాస్తులు వచ్చాయి. 2019-21లో 46 దుకాణాలకు 684 దరఖాస్తులు రాగా, 2021-23 సంవత్సరంలో 59 మద్యం దుకాణాలకు 923 దరఖాస్తులు వచ్చాయి. 2023-25 ఆర్థిక సంవత్సరంలో 59 మద్యం దుకాణాలకు 2,637 దరఖాస్తులు వచ్చాయి. గత ఎక్సైజ్ ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి 829 దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తుకు రూ.2 లక్షలు ఫీజు నిర్ణయించగా, ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే.

నవాబ్‌పేట దుకాణానికి పోటాపోటీ

జిల్లాలోని 59 మద్యం దుకాణాలకు 1,808 దరఖాస్తులు రాగా అత్యధికంగా వికారాబాద్ సర్కిల్ పరిధిలోని నవాబ్‌పేట(గజిట్ నం.వికెబి030) మద్యం దుకాణానికి 65 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా తాండూరు సర్కిల్ పరిధిలోని బాగాయిపల్లి (గజిట్ నెం.వికెబి018)లోని మద్యం దుకాణానికి 15 దరఖాస్తులు వచ్చాయి. మద్యం వ్యాపారం చేస్తున్న వారే కాకుండా వివిధ పార్టీలకు

మిగతా 8వ పేజీలో...


అంబేద్కర్ భవన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

వచ్చిన దరఖాస్తులిలా..

సర్కిల్	మద్యం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు
వికారాబాద్	15	484
పరిగి	12	481
తాండూరు	18	452
మోమిన్‌పేట్	06	187
కొడంగల్	08	294
మొత్తం	59	1,808

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మద్యం దుకాణాల కేటాయింపునకు మేడ్చల్ జిల్లాలో ఎక్సైజ్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఫీర్జాదిగూడ శ్రీ పలనీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు కలెక్టర్ మను చౌదరి డ్రా తీసి దుకాణాలను కేటాయిస్తారు. దరఖాస్తుదారులు ఉదయం 9 గంటలలోపే సెంటర్‌కు చేరుకోవాలని, హాలులోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లాలో మేడ్చల్, మల్కాజిగిరి ఎక్సైజ్ డివిజన్లు ఉండగా, మేడ్చల్ ఎక్సైజ్ డివిజన్ పరిధిలో 118 మద్యం షాపులకు 5,791 దరఖాస్తులు వచ్చాయి. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని 88 మద్యం దుకాణాలకు 5,069 దరఖాస్తులు వచ్చాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగే మద్యం దుకాణాల డ్రా కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. డ్రాకు హాజరయ్యే వారు ఎంట్రీ పాస్‌తో ఉదయం 10 గంటలలోగా వేదిక వద్దకు చేరుకోవాలి. మొదట గజిట్ దుకాణాల ప్రకారం దరఖాస్తుదారుల హాజరు తీసుకుంటారు. ఆ తర్వాత డ్రాలో పాల్గొనేందుకు అనుమతి ఉంటుంది. దరఖాస్తుదారులు సకాలంలో హాజరు కావాలి

- విజయభాస్కర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, వికారాబాద్


జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఆరోగ్యంతోనే జీవన ప్రమాణాలు మెరుగు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉంటేనే జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఆదివారం అనంతగిరిలో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ మొదటిసారిగా ట్రయల్ రన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ రన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి జీవితంలో ఆరోగ్యమే ప్రధానమని, దేశ శ్రేయస్సు ఆరోగ్యకరమైన జనాభాపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. అనంతగిరి అటవీ ప్రాంతం ఔషధ మొక్కలకు నిలయమని, ఇక్కడ గాలి ఆరోగ్యాన్ని మరింత మెరుగు పరుస్తుందన్నారు. ఈ ప్రాంతంలో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ట్రయల్ రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 1,000 మందికి పైగా తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. నిర్వాహకులు 5కే, 10కే, 20కే, 32కే రన్ నిర్వహించి పతకాలు బహూకరించారు. అనంతరం కలెక్టర్ అనంతగిరి ఎకో అర్బన్ పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంట్రీ గేట్ బాగుందని ప్రశంసిస్తూ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, అడిషనల్ ఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్, హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ క్లాసులని పిలిపించుకొని..

- విద్యార్థిని పట్ల అసభ్యకర ప్రవర్తన
- ప్రిన్సిపాల్‌పై కేసు

కీసర రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ క్లాసుల పేరుతో ఎనిమిదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌పై కేసు నమోదైంది. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకుంది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ ఈస్ట్ గాంధీనగర్‌లో కొనసాగుతున్న శాంతినికేతన్ పాఠశాలలో సాయిబాబా(61) ప్రిన్స్‌పాల్‌గా వ్యవహరిస్తున్నాడు. అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని చదువులో వెనకబడిందని, ప్రత్యేక తరగతుల పేరిట పాఠశాల అయిపోయిన తర్వాత పిలిపించుకొని విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించేవాడు. అతని చేష్టలు భరించలేని విద్యార్థిని విషయాన్ని తల్లితండ్రులకు చెప్పింది. వారు ఆదివారం కీసర పోలీసులను ఆశ్రయించగా వారి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.



బోనస్ ఎప్పుడిస్తారు?

సీజన్లు మారినా సన్న వడ్లకు అందని డబ్బులు

రైతులకు జమ కావాల్సినవి రూ.4.46 కోట్లు

రూ.500 బోనస్‌పై ఆశలు..

బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

పరిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'నువ్వు ఎక్కాల్సిన ట్రైన్ జీవితకాలం లేట్' అన్న చందంగా మారింది సన్న వడ్లకు బోనస్ వ్యవహారం.. సన్న రకం వరి ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన బోనస్ ఇంకా పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోనస్ వస్తుందన్న ఆశతో సన్నరకం వరి సాగు విస్తీర్ణాన్ని పెంచుతూ వచ్చిన రైతులు గత యాసంగిలో అమ్ముకున్న సన్న వడ్లకు ఆరు నెలలు గడిచినా బోనస్ రాలేదని ఆరోపిస్తున్నారు. సీజన్లు మారిపోతున్నాయే తప్ప బోనస్

మిగతా 8వ పేజీలో...

రూ.27 వేలు రావాలి



ప్రభుత్వం సన్న వడ్లు పండిస్తే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పింది. నేను గత యాసంగిలో సన్న రకం సాగు చేశాను. 54 క్వింటాళ్ల సన్న రకం ధాన్యాన్ని ఆరు నెలల క్రితం అమ్మిన. ధాన్యం డబ్బులు పడ్డాయి, కానీ క్వింటాలుకు ఇచ్చే రూ.500ల బోనస్ ఇప్పటివరకు పడలేదు. నాకు రూ.27 వేలు బోనస్ పడాల్సి ఉంది. బోనస్ ఇస్తారన్న ఆశతో వానాకాలంలోనూ సన్నాలను సాగు చేశాను.

- కొప్పు గోపాల్, రైతు, పరిగి

నేటి నుంచి కొత్త భవనంలో సేవలు

- శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్

శామీర్‌పేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట దర్గా సమీపంలో నూతనంగా ప్రారంభించిన కార్యాలయ భవనంలో రిజిస్ట్రేషన్ సేవలను సోమవారం ప్రారంభిస్తామని శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం పాత కార్యాలయం నుంచి తరలింపు పనులను, నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి రిజిస్ట్రేషన్ సేవలు నూతన కార్యాలంలోనే కొనసాగుతాయని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్‌ను సన్మానించారు. ఇకనుంచి శామీర్‌పేట, మూడుచింతలపల్లి, జవహర్‌నగర్ మండలాల ప్రజలు రిజిస్ట్రేషన్ల కోసం కొత్త కార్యాలయ భవనంలోకే రావాలని కోరారు.


సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

పెద్దేముల్‌లో డ్రోన్ల కలకలం

- పోలీసుల విస్తృత తనిఖీలు

పెద్దేముల్, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా పెద్దేముల్ మండలంలో డ్రోన్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని నిగ్గు తేల్చడానికి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టినా ఆధారాలు లభించలేదు. అవి ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎవరు ఎగురవేస్తున్నారు, వాటి వెనక ఉన్న ఉద్దేశమేమిటనే విషయాలను కనుక్కోలేకపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దేముల్ మండలం రుద్రారం, నర్సాపూర్, నాగులపల్లి, పెద్దేముల్ తండా తదితర గ్రామాల్లో శుక్రవారం నుంచి చీకటిపడగానే డ్రోన్లు ప్రత్యక్షమవుతున్నాయి. మిరుమిట్లు గొలుపుతూ గ్రామాలపై చక్కర్లు కొడుతున్నాయి. రాత్రివేళ వాటిని చూస్తే ఆకట్టుకునే విధంగా కనిపిస్తున్నా అవి ఎందుకు తిరుగుతున్నాయో తెలియక జనం ఆందోళన చెందుతున్నారు. పోలీసులకు ఫోన్లు చేసి ఫిర్యాదులు చేస్తున్నారు. పోలీసులు సైతం అదే రాత్రివేళ ఆయా గ్రామాలు తిరుగుతూ ఎవరు ఎగురవేస్తున్నారో తెలుసుకునే ప్రయత్నం చేసినా ఫలితం లభించడం లేదు. ఈ క్రమంలో ఆదివారం పోలీసులు మూడు బృందాలుగా విస్తృత తనిఖీలు చేపట్టారు. గొట్లపల్లి, తట్టిపల్లి, తింసన్‌పల్లి, పెద్దేముల్ గ్రామాల్లో వాహనాలను, ఫాంహౌజులను తనిఖీ చేశారు. గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. కొత్త వ్యక్తులపై ఆరీ తీశారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులకు డ్రోన్ల వ్యవహారం తలనొప్పిగా మారింది.


స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

విద్యా సంస్థలను తరలించొద్దు

కొడంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మెడికల్, వెటర్నరీ కళాశాలలను తరలించొద్దని, కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు. విద్యా సంస్థల తరలింపునకు నిరసనగా ఆదివారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో జేఏసీ ఆధ్వర్యంలో వ్యాపారవేత్త రతన్‌లాల్‌లాహోటీ సంతకాల సేకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడంగల్‌కు మంజూరు చేసిన విద్యా సంస్థలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి కొడంగల్‌లోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్ జీ.సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, యు.రమేశ్‌బాబు, సూర్యనాయక్, నవాజ్, భీమరాజు, మధుసూదన్‌యాదవ్, రవీందర్‌నాయక్, పాండ్యనాయక్, వహీద్, చిన్నయ్య, బుచ్చప్ప, రుక్మోద్దీన్, పకీరప్ప, తుకారం పాల్గొన్నారు.


కొడంగల్‌లో సంతకాలు సేకరిస్తున్న జేఏసీ నాయకులు



కల్లాల నిర్మాణంపై ఆశలు
- కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు

8

చిట్టీలోడు.. మహా మాయలోడు
- వసూలు చేసిన డబ్బుతో ఉడాయించిన వ్యాపారి

8

దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది

● ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో రక్తదానం చేస్తున్న యువకులతో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో విలువైందని, గొప్పదని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని సెయింట్ అంథొనీస్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సాధారణంగా ఒక వ్యక్తి రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణం పోస్తు ందని అన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలని కోరా రు. ఒక వ్యక్తి సంవత్సరంలో నాలుగుసార్లు రక్తదానం చేయొచ్చని వివరించారు. రక్తదానంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కేవలం రెండు మూడు రోజు ల్లో శరీరంలో పోయిన రక్తం సమకూరుతుందన్నారు. ఇందుకు పండ్లు, ఆకు కూరలు, పాలు తీసుకుంటే సరిపోతుందన్నారు. అయితే రక్తదానం ఒకరికి ప్రాణదానం అవుతుంది కనుక యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా 55 మంది రక్తదానం చేశారు. శివానంద పిడియాట్రిక్ క్యాన్సర్ సెంటర్ బృందం రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో డాక్టర్ శ్రవంతి, మాజీ కౌన్సిలర్ జహంగీర్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలి



సదర్ వేడుక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్, సంఘం నాయకులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా యాదవ పండుగైన సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లోని క్యాంప్ ఆఫీసులో ఆదివారం సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవ పోస్టర్ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. షాద్‌నగర్ మెయిన్ రోడ్డులో నవంబరు 2న నిర్వహించ తలపెట్టిన సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు యాదవులంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. కష్టజీవులైన యాదవులు రాజకీయాలకు అతీతంగా, మాటకు కట్టుబడి ఉండేవారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో ఓటు బ్యాంకు రాజకీయ కోసం యాదవులను విచ్ఛిన్నం చేశారని ఆరోపించారు. పార్టీలు ఏమున్నా.. ఐకమత్యంతో ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వై.యాదయ్యయాదవ్, రాఘునాథ్‌యాదవ్, ఎస్.యాదగిరి, బి.అంజయ్య, షాబాద్ మల్లేష్‌యాదవ్, నక్క బాల్‌రాజ్, మాధవులు, పసుల నర్సింహ, తుమ్మల నర్సిహ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్?

● నేడు ఉత్తర్వులు అందజేయనున్న ఎంఈవో

తాండూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):కరన్‌కోట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన సైన్స్ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సోమవారం(నేడు) ఉత్తర్వులు అందజేస్తామని ఎంఈవో వెంకటయ్య ఆదివారం తెలిపారు. కరన్‌కోట్ జెడ్పీ పాఠశాలలో ఓ బాలిక పట్ల సైన్స్ ఉపాధ్యాయుడు రాఘవేందర్‌రెడ్డి ఈ నెల 22న పాఠశాలలో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వెంటనే కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉపాధ్యాయుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాండూరు ఎంఈవో వెంకటయ్య పాఠశాలలో విచారణ జరిపారు. నివేదికను డీఈవోకు అందజేశారు. నివేదిక ఆధారంగా సదరు టీచర్ తప్పు చేసినట్టు నిర్ధారించి డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఉత్తర్వులను సోమవారం ఉపాధ్యాయుడికి పాఠశాలలో ఇస్తామని ఎంఈవో తెలిపారు.

ఘనాపూర్‌లో భక్తి శ్రద్ధలతో మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్-మమత దంపతులు, గ్రామస్తులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లో ఆదివారం మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్ నివాసంలో ఒగ్గు కళాకారుల ఆటపాటల మధ్య మల్లన్న కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో మహేశ్‌గౌడ్-మమత దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పీర్జాదిగూడ మాజీ డిప్యూటీ మేయర్ రవిగౌడ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, అర్జున్, నాయకులు బాలగౌని నర్సింహాగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, బొక్క సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కప్పేసిన చెట్లు

● రూ.6వేల సొంత డబ్బు వెచ్చించి నరికివేయించిన పోలీసులు
● ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్న రక్షక భటులు
● పోలీసుల సాయంపై తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామస్తుల హర్షం



నాగార్జున సాగర్ రహదారి నుంచి తక్కళ్లపల్లి వరకు ఉన్న రోడ్డుపైకి వచ్చిన చెట్లను తొలగింపజేస్తున్న పోలీసులు

యాచారం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి నుంచి తక్కళ్లపల్లి-కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే దారిని రోడ్డుకిరువైపుల భారీ చెట్లు రోడ్డును ఆక్రమించాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకుండా చెట్లు రోడ్డును కమ్మేశాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయం గమనించిన యాచారం సీఐ ఏ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సైలు యు. మధు, ప్రియాంకలు తమ సిబ్బందితో రోడ్డును ఆక్రమించిన చెట్లను ఆదివారం నరికివేయించారు. పోలీసులు సొంతంగా రూ.6వేలు వెచ్చించి ఎక్స్‌కవేటర్‌తో చెట్లను నరికి వేయించారు. ఆరు కిలోమీటర్ల వరకు రోడ్డును ఆక్రమించిన చెట్లన్నింటినీ నరికి వేయించారు. అలాగే రోడ్డు పక్కన మట్టిపోయించి చదును చేయించారు. పోలీసులు తమ గ్రామాలకు వెళ్లే రోడ్డును ఆక్రమించిన చెట్లను తొలగించి మేలు చేశారని తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ పోలీస్ అధికారి కూడా ఇలాంటి పనులు చేయించలేదని, నేడున్న సీఐ, ఎస్సైలు ప్రజల సమస్యలను తీర్చడం ప్రశంసనీయమని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



రోడ్డును కప్పేస్తున్న చెట్లను తొలగిస్తున్న పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు

షెడ్ల నిర్మాణానికి భూమిపూజ



షెడ్డు నిర్మాణ భూమిపూజలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, నాయకులు

దుద్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయం పక్కన మటన్(కబేళా) షెడ్డు నిర్మాణానికి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, ఆలయ చైర్మన్ జయరాములు ఆదివారం భూమిపూజ చేశారు. రూ.30లక్షలతో షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కుమారస్వామి, సింగర్ నరసింహ, చంద్రయ్య, నరసింహ, కృష్ణ, వెంకటయ్యగౌడ్, యాదయ్యగౌడ్, ముస్తాక్, కొండయ్య, వెంకటయ్య, సాయిలుగౌడ్, రాములు, భగవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ కింద ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదివారం ఎల్వోసీలను అందజేశారు. యాలాల మండలం పగిడ్యాలకు చెందిన రాస్నం అరుణకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.2లక్షలు, పెద్దేముల్ మండలం రుద్రారానికి చెందిన లలితకు రూ.2.25లక్షల ఎల్ఓసీని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు లొంక నర్సిములు, ఉప్పరి మల్లేశం తదితరులు ఉన్నారు.

సాంకేతిక బోధన అందించాలి



ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని సందర్శించిన అరుణ

పరిగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సాంకేతిక బోధనను అందించాలని టీవోఎస్ఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అరుణ అన్నారు. ఆదివారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.1, 2స్కూళ్లలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి వారం నిర్వహించే తరగతులకు క్రమం తప్పక హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు పాఠాలు వింటేనే పరీక్షలు రాయగలుగుతారని చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాలు అందుబాటులో లేని కారణంగా పరీక్షలు రాయలేకపోతున్నామని, నియోజకవర్గ కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, టీచర్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి యువ ఆచార్య అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సీఎంఆర్ అధ్యాపకుడు జి.మధుకర్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్సీ పురస్కారంలో భాగంగా సీఎంఆర్ కళాశాల అధ్యాపకుడు మధుకర్‌కు యువ ఆచార్య అవార్డు దక్కింది. అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) స్టేట్ కోఆర్డినేటర్ బుద్ధ చంద్రశేఖర్ నుంచి అవార్డు అందుకున్నారు. సాంకేతిక విద్య బోధనతో పాటు, విద్యారంగంలో పరిశోధనల పట్ల ప్రతిభ కనబర్చే అధ్యాపకులకు బ్రోయినో విజన్ సంస్థ అవార్డులను అందజేస్తోంది. ఈ సందర్భంగా సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ ఎ.రాజిరెడ్డి, డీన్ భాస్కర్ తదితరులు మధుకర్‌కు అభినందనలు తెలిపారు.

పోలీసులకే రక్షణ లేకపోతే ఎలా?



నరేందర్‌రెడ్డి

కేశంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేకపోతే ఎలా? అని బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేశంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం హైదరాబాద్‌లో సెల్‌ఫోన్ దొంగతనం చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించిన డీసీపీ చైతన్యకుమార్, ఆయన గన్‌మన్ మూర్తిలపై దొంగలు కత్తితో దాడి చేశారని తెలిపారు. పోలీసులపై దాడిని ఖండిస్తున్నామన్నారు. నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ హత్య, అలాగే హైదరాబాద్ సమీపంలో గోరక్షక్‌పై కాల్పులు జరిగాయన్నారు. రాష్ట్రంలో లాఅండ్‌ఆర్డర్ గతి తప్పుతోందని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో వెంటనే హోంశాఖ మంత్రిని నియమించి శాంతి భద్రతలను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.



షాబాద్‌లో రిలే దీక్షలు చేస్తున్న నాయకులు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లివ్వాలి

షాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు మాణిక్యం, శేఖర్, రాజేందర్‌గౌడ్, రవి, చేవెళ్ల స్వామి, నర్సింలు, కిరణ్, శ్రీశైలం, చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ షాబాద్‌లో 15రోజులుగా షాబాద్‌లో రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యతతోనే రిజర్వేషన్లు సాధ్యమన్నారు. పార్లమెంట్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టేలా పార్లమెంట్ సభ్యులు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్ఞానం అందించేవాడే కవి

» జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి



శ్రీ సాయి, ప్రకృతి వైద్య శతకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

వికారాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కవి తన చుట్టూ ఉన్న సమస్యలను పరిశీలించి, పద్య రూపంలో సమాజానికి జ్ఞానం అందిస్తారని, శతకాల ద్వారా మానవ విలువలను పెంపొందిస్తారని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్‌లో పద్యపద భారతి సాహిత్య సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో సంకల్ప్ విద్యాపీఠంలో డైట్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బందప్పగౌడ్ రచించిన శ్రీ సాయి శతకం, ప్రకృతి వైద్య శతకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పాల్కూరి నుంచి నేటి వరకు పలువురు కవులు, రచయితలు సమాజ శ్రేయస్సు కోసం రచనలు సాగించారని తెలిపారు. డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, గంటా మనోహర్ రెడ్డి, సీపీరెడ్డిలు మాట్లాడుతూ.. సాయి శతకం, ప్రకృతి వైద్య శతకం రాయడం అభినందనీయమని, ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజలు పాశ్చాత్య ఆహార అలవాట్లతో రోగాల బారిన పడుతున్నారని, భారతీయ ఆయుర్వేద విలువలను ఆధునీకీకరించి ప్రజలకు చేరవేయాలన్నారు. ఇంద్రియాలు, ఆత్మ కలిసినపుడు ఆయుర్వేదంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మొరంగపల్లి బాగయ్య, అంజయ్య, ధన్‌శెట్టి బొల్లాడ్ రాఘవేంద్రచార్యులు, మల్కానెల్లి లాల్‌రెడ్డి, పోలె విశ్వనాథం, సుధాకర్‌గౌడ్, డాక్టర్ మున్నూరు రోజా, రెడ్యారాథోడ్, శ్రీనివాసచారి, దివాకర్‌శాస్త్రి, శంకరయ్య, మొగులయ్య, మాణిక్యరావు, కులకర్ణి సుదర్శనరావు పాల్గొన్నారు.

పిట్టల శ్రీశైలానికి రైతు నేస్తం అవార్డు



రైతు నేస్తం అవార్డు అందుకుంటున్న పిట్టల శ్రీశైలం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అండగా నిలుస్తున్న ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంకుశాపూర్‌కు చెందిన పిట్టల శ్రీశైలంకు రైతు నేస్తం అవార్డు దక్కింది. ఈ మేరకు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రైతునేస్తం 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శంషాబాద్‌లో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ సుబ్బారావు పేరిట అవార్డులను అందజేశారు. పిట్టల శ్రీశైలం సీనియర్ జర్నలిస్టు అయినా వ్యవసాయంపై మక్కువతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచాడు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రైతు విభాగం నుంచి 12 మందికి, శాస్త్రవేత్త విభాగం నుంచి 12 మందికి, నూతన ఆవిష్కరణ విభాగంలో ఐదుగురికి, విస్తరణ విభాగం నుంచి మరో 12 మందికి రైతు నేస్తం అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు పద్మశ్రీ యడ్లవల్లి వెంకటేశ్వరావు, ముప్పవరపు ఫౌండేషన్ అధ్యక్షుడు హర్షవర్దన్, వ్యవసాయశాఖ నిపుణులు కొసరాజు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మేకల పద్మారావు, సత్యం, లింగస్వామి, చిలక గణేష్, సామాజిక కార్యకర్త సందుపట్ల నవజీవన్‌రెడ్డి, కుంటోళ్ల యాదగిరి పిట్టల శ్రీశైలంను అభినందించారు.

మేడ్చల్‌లో నీటి తిప్పలు

» గత్యంతరం లేక బోర్లు, ట్యాంకర్లపై ఆధారపడుతున్న పట్టణ వాసులు

» ఎద్దడి తీర్చాలని అధికారులకు వేడుకోలు

సరఫరా తగ్గించిన మిషన్ భగీరథ అధికారులు



మేడ్చల్‌లో మున్సిపల్ ట్యాంకర్ ద్వారా చేస్తున్న నీటి సరఫరా

మేడ్చల్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ వాసులకు నీటి కష్టాలు తప్పటం లేదు. వేసవి నుంచి ఇప్పటి వరకు మంచినీటి సమస్యను అధికారులు పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీ పరిధి వార్డుల్లో రెండు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే నాలుగు నెలలుగా మున్సిపల్ పరిధిలోని ఏ ఒక్క వార్డులోనూ ప్రజలకు సరిపడా నీరు వదలడం లేదు. దీంతో చాలా మంది ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొంటున్నారు. ఈ సమస్యపై ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పలుమార్లు మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకుపోయినా తమ చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తేస్తున్నారు. మేడ్చల్‌కు మిషన్ భగీరథ నీరు సరఫచా చేసే పంప్ హౌజ్‌కు పైనుంచే సరిపడా నీరు వదలడం లేదని అధికారులే ఒప్పుకుంటున్నారు. గాగిల్లాపూర్, నిజాంపేట్ మున్సిపాలిటీలకు నీరు సరిపోవటం లేదని మిషన్ భగీరథ ఉన్నతాధికారులు మేడ్చల్ మున్సిపాలిటీకి నీటి కోత విధించి ఆ మున్సిపాలిటీలకు నీరు వదుళ్తున్నందున మేడ్చల్‌కు ఈ సమస్య తలెత్తిందని కొందరు అధికారులు తెలిపారు. ఒక వైపు వర్షాలు పుష్కలంగా కురిసినా పట్టణ ప్రజల దాహార్తి మాత్రం తీరడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా

నీటి కొరతను అధిగమించేందుకు మున్సిపల్ అధికారులు బోర్ల ద్వారా నల్లా నీటిని సరఫరా చేసే పనిలో పడ్డారు. పైప్‌లైన్ లేని ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే నీటి సమస్యను పరిష్కరించాలని 64 పాత బోర్లను అధికారులు పునరుద్ధరించి వాటిలో మోటార్లు బిగించే పనిలో పడ్డారు. ఈ బోర్ల నీటిని ఓవర్ హెడ్ ట్యాంకులు నింపి నీటిని సరఫరా చేసి నల్లాల ద్వారా ఇంటింటికి నీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపల్ ట్యాంకర్లతో పాటు ప్రైవేట్ ట్యాంకర్లను అద్దెకు తీసుకుని మొత్తం 12 ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు.

ఫ్లోరైడ్ నీటితో సరిపెట్టుకునే దుస్థితి..

వర్షాలు పుష్కలంగా కురవడంతో మేడ్చల్‌లోని అన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పుష్కలంగా పెరిగాయి. వేసవిలో ఎండిన బోరు బావులు రీచార్జి అయి చాలా కాలనీల్లో సొంత బోర్లతో నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. అయితే వ్యక్తిగత బోర్ల నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఈ నీటిని వినియోగించేందుకు ఇష్టపడటం లేదు. కొన్నేళ్లుగా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న ప్యూరిఫైడ్ గోదావరి జలాలకు ప్రజలు అలవాటు పడ్డారు. ఇదే నీటిని తాగేందుకు, ఇతర అవసరాలకు వాడుతున్నారు. పట్టణంలో చాలా మంది తమ బోర్ల వాడకాన్ని నిలిపేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బోరు నీటిని వాడని ప్రజలు ఇప్పుడు గత్యంతరం లేక బోర్లపై ఆధారపడుతున్నారు. తాగేందుకు ఆర్వో నీటికి కొనుక్కుంటున్నారు.

నాయకుల వైఫల్యమే అంటున్న ప్రజలు

మేడ్చల్ మున్సిపాలిటీకి కేటాయించిన మిషన్ భగీరథ నీటి వాటాను ఇతర మున్సిపాలిటీలకు విడుదల చేస్తునప్పటికీ అధికార పార్టీ నాయకులు నోరు మెదపక పోవటం పట్ల స్థానికులు మండి పడుతున్నారు. ఈ విషయంలో స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ పలుమార్లు మిషన్ భగీరథ అధికారులు, జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు పోయినప్పటికీ ప్రయోజనం చేకూర లేదు. ఇక స్థానిక ఎమ్మెల్యేకు ఈ విషయం పట్ల పట్టింకునే పాపాన పోవటం లేదుని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమస్య నుంచి గట్టెక్కించే అధికార పార్టీ నాయకులుకు పట్టింపు లేకుండా పోవటంతో నీటి సమస్య గురించి పట్టించుకునే నాథులు లేకుండా పోయాడని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్య పై ఇక నైన నాయకులు అధికారులు స్పందించి ప్రతి వార్డుకు సరిపడు నీరును సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పక్షం రోజులుగా తాగునీటి తండ్లాట

పెద్దేముల్: మండలంలోని గాజీపూర్ గ్రామంలోని ఒకట వార్డు ప్రజలు తాగునీటికి తండ్లాడుతున్నారు. మోటారు పాడై 15 రోజులు కావస్తున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సమస్య తీర్చండి సారూ.. అంటూ ఆదివారం పాడైన బోరు మోటరు వద్ద వార్డు ప్రజలు నిరసన చేపట్టారు. మిషన్ భగీరథ నీరు నిత్యం రావడం లేదని రెండు, మూడు రోజులకోసారి వస్తుండడంతో తాగునీటి సమస్య తీవ్రమవుతున్నదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



పాడైన బోరు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పత్తికి ముసురు కష్టాలు

» భారీగా పడిపోతున్న దిగుబడి

» పత్తి రైతులకు కలిసిరాని కాలం

చౌదరిగూడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ముసురు వర్షంతో కష్టాలు మొదలయ్యాయి. పండించిన పంటలు వర్షార్పణం అవుతున్నాయి. ఇటీవలి, గతంలో కురిసి భారీ వర్షాలకు మొక్కజొన్న, కంది పంటల దిగుబడి తగ్గింది. ప్రస్తుతం కురుస్తున్న ముసురుతో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగే ఆస్కారం ఏర్పడింది.

నల్లబారుతున్న తెల్ల బంగారం ...

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 6వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలతో పత్తి పంట దిగుబడి తగ్గి ఎకరానికి 4 నుంచి 5క్వింటాళ్లు మాత్రమే వచ్చేలా ఉందని రైతులు వాపోతున్నారు. పంటల కోత దశలో ఇప్పుడు కురుస్తున్న ముసురుతో మరింత నష్టం వాటిల్లుతోంది. చెట్టుపైనే పత్తి నల్లబారుతోంది. రోగాలు సోకి కాయలు కుళ్లుతున్నాయి. పగిలిన పత్తి ముసురుతో నల్లబారుతోంది. తడిసి ముద్దయిన పత్తి తీసేందుకు కూడా వీల వడం లేదు. పత్తి గింజలు రాలి చెట్టుపైనే మొలకెత్తుతున్నాయి. దీంతో రైతులకు ఏం చేయాలో తోచడం లేదు. పెట్టుబడైనా వస్తుందా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది పత్తి రైతులు దారుణంగా నష్టపోతున్నారు. పత్తితో పాటు వానకాలంలో సాగుచేసిన వరి, మొక్కజొన్న, కంది, జొన్న పంటల పరిస్థితి పత్తి తరహాలోనే ఉంది. వానకాలంలో మండలంలో వరి 7,400 ఎకరాల్లో, పత్తి 6వేలు, మొక్కజొన్న 4,023 ఎకరాల్లో, కందులు 580ఎకరాలు, జొన్న 190 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు లెక్క తేల్చారు.



వనంపల్లిలో పగిలిన పత్తి

పెట్టుబడైనా వచ్చేలా లేదు



ఈ ఏడాది నేను ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. భారీ వర్షాలకు ఎకరాని 4 క్వింటాళ్ల దిగుబడైనా వచ్చే అవకాశం లేదు. పెట్టుబడి ఖర్చులైనా వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. ఈ సారి పత్తి రైతులకు నష్టం తప్పేలా లేదు. పోయిన సారి దిగుబడి బాగుండి, ధర కూడా ఎక్కువగా ఉందన్న ఆశతో చాలా మంది రైతులు పత్తి విస్తీర్ణాన్ని పెంచారు.

- కొండి యాదయ్య, రైతు, ఎల్కగూడ

వర్షాలతో పంటలకు నష్టం



కులకచర్ల శివారులో నేలకొరిగిన వరి చేను

కులకచర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నిరంతరం కురుస్తున్న చినుకులు, గాలి కారణంగా పంటలు నేలకొరుగుతున్నాయి. రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు వరి పంట పాక్షికంగా దెబ్బతింది. వర్షంతో వరి నేలకొరిగింది. వరి పంటకు వివిధ రకాల తెగుళ్లు సోకడంతో పురుగుల మందు పిచికారి ఎక్కువగా చేశారు. వరి చేలు నేలవాలి మొలకొచ్చేలా ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



వర్షాల కారణంగా పంటలకు తెగుళ్ల సోకి దిగుబడి తగ్గిపోయింది. పెట్టుబడి రాక అప్పులు మిగిలేలా పరిస్థితి ఉంది. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- బంగారు బాల్‌రాజ్, రైతు, తుమ్మలపల్లి

కాల్పుల కేసు నిందితుడి కోసం గాలింపు

» బృందాలుగా పోలీసుల సెర్చ్ ఆపరేషన్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గోరక్షక్ దళ సభ్యుడు ప్రశాంత్ అలియాస్ సోనూసింగ్‌పై కాల్పులు జరిపిన నిందితుడి వేటలో పోలీసులు ఉన్నారు. యంనంపేట్‌లోని కిట్టి స్టీల్ ఎదురుగా ఉన్న ఓ వెంచర్‌లో ఈ నెల 22న ప్రశాంత్‌పై హైదరాబాద్‌లోని బహద్దూర్‌పురకు చెందిన ఇబ్రహీం ఖురేషీ(24) తుపాకీతో కాల్చి, తన స్నేహితులైన మస్నాబిన్ మోసిన్(22), కురువ శ్రీనివాస్(30), హనీఫ్ ఖురేషీ(34)లతో కలిసి కారులో పరారయ్యారు. రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. 9 బృందాలుగా ఏర్పడిన పోలీసులు కొన్ని గంటల్లోనే మహ్మద్ ఇబ్రహీం ఖురేషీ, కురువ శ్రీనివాస్, మోసిన్‌లను అరెస్టు చేశారు. మరో నిందితుడు హనీఫ్ ఖురేషీ తప్పించుకున్నాడు. 23న ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కాగా పరారీలో ఉన్న హనీఫ్ ఖురేషీ కోసం నాలుగు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. హైదరాబాద్ పాతబస్తీతో పాటు ముంబాయి, పుణె తదితర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. నిందితుడు హనీఫ్ ఖురేషీని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్నిరంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు నర్సింహ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి యువత విలాసాల పేరుతో సమయం వృధా చేయకుండా వకాశాలను సద్వియోగం చేసుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు విద్యలో రాణించడానికి నిరంతరం శ్రమించాలన్నారు. ఉన్నత విద్యతోనే అంబేడ్కర్ రాజ్యాంగ రచనలో తనవంతు పాత్రను పోషించాడని గుర్తుచేశారు. ఆమహనీయున్ని ఆదర్శంగా తీసుకొని యువతరం అన్నిరంగాల్లో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, నర్సింగరావు, సత్యం, నారాయణ, వేణుగోపాల్, గణేష్, ఆనంద్, నిఖిల్ పాల్గొన్నారు.

ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పథకాలను అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని చెప్పారు. సాలార్‌పూర్‌లో నిర్మించిన కెతావత్ దోళి ఇందిరమ్మ ఇంటిని ఆదివారం ఎమ్మెల్యే, ఆమనగల్లు మార్కెట్ ఛైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు ఒక్క ఇల్లూ కట్టివ్వలేదని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో కాలయాపన చేశారని విమర్శించారు. పేదల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇళ్లు ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకున్న వారికి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల మంజూరు, నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియలని, రెండో విడతలో మరికొందరికి ఇళ్లు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మార్కెట్ డైరెక్టర్ మిట్టపల్లి అంజయ్య, నాయకులు శంకర్, మోహన్, శ్రీశైల, సిలారి, ఎక్బాల్, రాజు, శ్రీను, హరి, కుమార్, లింగం, విష్ణు, వెంకట్‌రెడ్డి, షాబుద్దీన్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న మక్తమాదారం గ్రామానికి చెందిన రాజమోని లక్ష్మయ్యను ఎమ్మెల్యే నారాయణరెడ్డి పరామర్శించారు. అవేర్ ఆస్పత్రిలో లక్ష్మయ్యను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4వేల సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ ఛైర్‌పర్సన్ యాట గీత, నాయకులు అంజయ్య, బాల్‌రాజ్, నర్సింహ తదితరులు ఉన్నారు. అలాగే సాలార్‌పూర్ తండాలో ఇటీవల మృతిచెందిన లింగమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి రూ.8వేల సాయం అందించారు.

ఉప ఎన్నిక ప్రచారంలో కల్వకుర్తి నేతలు

ఆమనగల్లు: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారానికి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్యేకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎమ్మెల్యేతో కలిసి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, హన్మానాయక్, మండ్లీ రాములు, యాట నర్సింహ, ఆనంద్, గుర్రం కేశవులు, వెంకటేశ్ లక్పతినాయక్ తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధితోనే సమాజ అభివృద్ధి



ఆర్థిక సాయం అందజేస్తున్న శంకర్

కొడంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధితో సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర మున్నూర్ కాపు మహాసభ మాజీ ఉపాధ్యక్షుడు నిమ్మ శంకర్ అన్నారు. కాచిగూడ మున్నూర్ కాపు భవన్‌లోని మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో కొడంగల్ ప్రాంతానికి చెందిన బీవీఎస్సీ, ఏహెచ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బకారం నాగలక్ష్మీ ఫీజు నిమిత్తం రూ.30వేల ఆర్థిక సహాయాన్ని ప్రముఖ పారిశ్రామిక వేత్త, మహాసభ మాజీ ఉపాధ్యక్షుడు నిమ్మ శంకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ గల విద్యార్థులు పేదరికంతో విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద మున్నూర్ కాపు విద్యార్థుల ఉన్నత చదువులకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, కొడంగల్ మున్నూర్ కాపు సంఘం అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్, కొండూరు వినోద్‌కుమార్, పుంజాల దత్తు మూర్తి, శ్రీనివాస్‌రావు, చెలిమేల రమేశ్‌కుమార్, కేఎస్ ఆనంద్, నర్సిరెడ్డి, రమేశ్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీలేని రుణాలు



సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

కులకచర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల నుంచి వడ్డీలేని రుణం రూ.లక్ష ఇప్పిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామంలో శని వారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అనుమతితో రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తున్నామన్నారు. మండల పరిధిలో ఇప్పటి వరకు రెండు విడతలుగా 608 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి సేవా సమితి కొడంగల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 57 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 27మందిని ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి, భజన మండలి సభ్యులు దశరథ్, శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ, నర్సిరెడ్డి, మల్లప్ప, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు సింధూజ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యం



ఫౌండేషన్ సభ్యులతో చైర్మన్ ఆలమయ్యనాయుడు

బొంరాస్‌పేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవే మైత్రి సేవా ఫౌండేషన్ ట్రస్టు లక్ష్యమని ఆ ట్రస్టు చైర్మన్ పాలెపల్లి ఆలమయ్య నాయుడు అన్నారు. బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997-98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈనెల 15న మైత్రి సేవా ఫౌండేషన్ ట్రస్టు రిజిస్ట్రేషన్ చేసుకున్న సందర్భంగా మొదటి సారి ఆదివారం తుంకిమెట్ల ట్రస్టు కార్యాలయంలో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు భవిష్యత్ కార్యాచరణ, సేవా కార్యక్రమాలపై చర్చించారు. వచ్చే ఏడాదికి ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక సేవలను అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతీ సంవత్సరం ఫౌండేషన్ తరపున ప్రోత్సాహకాలకు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్టులో చైర్మన్‌తో పాటు నియమితులైన సభ్యులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వైస్‌చైర్మన్ తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, కోశాధికారి అశోక్‌గౌడ్, అడ్మినిస్ట్రేటర్ రవీందర్‌రెడ్డి, సభ్యులు రాజేశ్‌రెడ్డి, అనంతచారి, శివగౌడ్, ఈశ్వర్‌గౌడ్, భావ్‌సింగ్, సలీం, నసీర్, అనంతరాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్లాల నిర్మాణంపై ఆశలు

- కేంద్ర ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు
- రైతులకు చేకూరనున్న లబ్ధి



అంతారంలో రైతు నిర్మించుకున్న కల్లం

కులకచర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు అవసరమయ్యే కల్లాల నిర్మాణానికి కేంద్రం నుంచి మార్గదర్శకాలు వెలువడ్డాయి. దీంతో కల్లాల నిర్మాణంపై రైతులకు మరోసారి ఆశలు చిగురించాయి. ఉపాధిహామీ పథకంలో భాగంగా కల్లాల నిర్మాణాలు చేసుకునేలా అంగీకారం తెలుపగా ఇంకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. గత రెండేళ్లలో ఈ పథకం అమలులో ఉండగా గతంలో మండలంలో మొత్తం 350కిపైగా మంది రైతులు కల్లాలను నిర్మించుకున్నారు.

రోడ్లపై ఆరబోతతో ప్రమాదాలు

రైతులు పంట ఉత్పత్తులను రోడ్లపై ఆరబెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. దీంతో కొంత మంది రైతులపై కేసులు నమోదైన సందర్భాలు ఉన్నాయి. ధాన్యం ఆరబెట్టేందుకు అద్దె ప్రాతిపాదికన టార్పాలిన్లు తీసుకున్న వారు ఏటా కనీసం రూ.2వేల నుంచి రూ.3వేల వరకు నష్టపోతున్నారు. ఈ పథకం అమలులో ఉండగానే కులకచర్ల మండలంలో చాలా మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కొందరు రైతులు నిర్మాణాలకు సంబంధించి ముగ్గు పోసి పునాదుల తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలో అర్థాంతరంగా కల్లాల నిర్మాణ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పథకాన్ని ప్రారంభించిన ఏడాదిన్నరకే రద్దు చేసిన కేంద్రం తాజాగా ఈ పథకానికి అంగీకారం తెలిపింది. ఈసారి చాలా మంది రైతులు కల్లాల నిర్మాణానికి ఆసక్తి చూపుతున్నారు. కల్లాల నిర్మాణంతో పంట ఉత్పత్తులు ఆరబెట్టడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

అవగాహన లేక నిర్మించుకోలేదు



ధాన్యం ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు రైతులకు కల్లాల నిర్మాణం అత్యవసరం. గతంలో ఒకసారి కేంద్ర ప్రభుత్వం అనుమతించగా సరైన అవగాహన లేక చాలా మంది రైతులు నిర్మించుకోలేకపోయారు. కేంద్రం సానుకూలంగా స్పందించడం సంతోషకరం. ఈసారి భారీగా కల్లాలు నిర్మించుకుంటారు.
- రాములుగౌడ్, రైతు, తిరుమలాపూర్

మార్గదర్శకాలు వస్తే దరఖాస్తులు స్వీకరిస్తాం



రైతులకు కల్లాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం. ఉపాధిహామీలో భాగంగా కల్లాల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరిస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. రైతులు కూడా నిర్మించుకునేందుకు ముందుకు రావాలి. **- చంద్రశేఖర్, ఏపీవో**

చిట్టీలోడు.. మహా మాయలోడు!

- నమ్మితే మోసం చేశాడు
- కుటుంబంతో సహా పరారీ
- రూ.15కోట్ల వరకు కుచ్చుటోపీ
- వారం రోజుల తర్వాత వెలుగులోకి
- తాండూరులో ఘటన



తాండూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో చిట్టీల పేరిట మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గతంలో బాలాజీ చిట్‌ఫండ్, కనకదుర్గ చిట్‌ఫండ్, ఓ మార్వాడీ రూ.కోట్లలో చిట్టీ డబ్బులు వసూలు చేసి ఎగనామం పెట్టిన విషయం తెలిసిందే. తాజాగా మరో మార్వాడీ వ్యాపారి మోసానికి పాల్పడ్డాడు. మెడికల్ షాప్‌తో పాటు ఏజెన్సీ నడుపుతున్న ఓవ్యాపారి తాండూరు పట్టణంలో పెద్ద ఎత్తున చిట్టీ డబ్బులు వసూలు చేసి కుటుంబసభ్యులతో కలిసి పరారయ్యాడు. తాండూరు మార్కెట్‌లో కొన్నేళ్లుగా వ్యాపారులను, అమాయక ప్రజలను ఎంతో నమ్మించి తాండూరు రైల్వేస్టేషన్ సమీపంలో మెడికల్ ఏజెన్సీ నడిపిస్తున్నాడు. చిట్టి వ్యాపారం కూడా సైడ్‌గా కొనసాగిస్తూ రూ.కోట్ల లావాదేవీలను జరిపారు. దీంతో మధ్య తరగతి ప్రజలు, బడావ్యాపారులు చిట్టీ వేశారు. దీపావళి పండుగ రోజు అందరితో సరదాగా గడిపిన ఈ వ్యాపారి మరుసటి రోజు కుటుంబసభ్యులతో కలిసి కనిపించకుండా వెళ్లాడు. అనుమానం వచ్చిన చిట్టీదారులు వారి బంధువుల ఇళ్లకి వెళ్లి ఆరాతీశారు. వ్యాపారి ఉడాయించాడని తెలియడంతో చిట్టి వేసిన వారు లబోదిబోమంటున్నారు. దీనిపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తాండూరు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. పరారీలో ఉన్న ఈ వ్యాపారి ఐపీ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల జరుగుతున్న మోసాలతో తాండూరు మార్కెట్‌లో అప్పులిచ్చేందుకు, ఆర్థిక లావాదేవీలు జరిపేందుకు వ్యాపారులు జంకుతున్నారు. తాండూరులో జీరో చిట్టి వ్యాపారం కూడా పెద్దఎత్తున జరుగుతోంది.

కోర్టు చుట్టూ తిరుగుతున్న బాధితులు

తాండూరులో చిట్‌ఫండ్ మోసాలతో అనేక మంది బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. బాలాజీ చిట్‌ఫండ్ నిర్వాహకులు నష్టాలను పేర్కొంటూ రూ.30-40కోట్ల వరకు డబ్బులు చెల్లించకుండా బిచానా ఎత్తివేసిన సంగతి తెలిసిందే. 300మంది బాధితులు ఇంత వరకు తమ డబ్బులు రాలేదని వాపోతున్నారు. ఈ చిట్‌ఫండ్‌లో 40ఏళ్ల నుంచి చిట్టీలు వేస్తున్న వారూ ఉన్నారు. మొదట్లో ఎంతో నమ్మకంగా చిట్‌ఫండ్‌ను కొనసాగించి ఇంత మోసం చేస్తారా అని బాధితులు వాపోతున్నారు. కోర్టు నుంచి ఐపీ తీసుకువచ్చి దర్జాగా మార్కెట్‌లో తిరుగుతున్నారని చెబుతున్నారు. వినాయచౌక్‌లో కనకదుర్గ చిట్‌ఫండ్ పేరిట పదేళ్లుగా చిట్‌ఫండ్ కొనసాగించి సుమారు రూ.5కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు వ్యాపారుల నుంచి చిట్టీలు వేయించి ఉడాయించారు. హన్మకొండలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడ కూడా కార్యాలయాన్ని ఎత్తేశారు. ఈ చిట్‌ఫండ్ తరుచూ ఏజెంట్లను మారుస్తూ చిట్టీదారులకు డబ్బులు ఇవ్వడకుండా అనేక ఇబ్బందులకు గురి చేశారు. గతేడాది ఆర్యవైశ్య కల్యాణ మండపం సమీపంలో మార్వాడీ వ్యాపారి ఒకరు చిట్టీల పేరిట సుమారు రూ.10కోట్లతో ఉడాయించాడు.

'లక్కు'న్నోళ్లకే 'కిక్కు'!

(ఐదో పేజీ తరువాయి)



లక్కీడ్రా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్

చెందిన రాజకీయ నాయకులు కూడా మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు ఈసారి పోటీ పడుతున్నారు. జిల్లాలో కొడంగల్, మోమిన్‌పేట ఎక్సైజ్ సర్కిళ్లు మినహా వికారాబాద్, తాండూరు, పరిగి సర్కిళ్ల పరిధిలోని మద్యం దుకాణాలకు తీవ్ర పోటీ నెలకొంది.

డిసెంబరు ఒకటి నుంచి కొత్త పాలసీ

కొత్త మద్యం పాలసీ ఈ ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచి 2027, నవంబరు 30వ తేదీ వరకు రెండేళ్లపాటు అమలులో ఉండనుంది. డ్రాలో విజేతలుగా నిలిచే వారికి ఈ ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచే మద్యం దుకాణాలను ప్రారంభించుకునేందుకు వీలుగా లైసెన్సులు జారీ చేయనున్నారు. రెండేళ్లపాటు వారికి కేటాయించిన దుకాణాల ద్వారా మద్యం విక్రయించనున్నారు. జిల్లాలోని మద్యం దుకాణాలకు మూడు స్లాబ్‌లు వర్తించగా.. రూ.50 లక్షల స్లాబ్‌లో 14 దుకాణాలు ఉన్నాయి. రూ.55 లక్షల స్లాబ్‌లో 28, రూ.60 లక్షల స్లాబ్‌లో 17 దుకాణాలు ఉన్నాయి. దరఖాస్తుల ద్వారా ఇప్పటికే రూ.54.24 కోట్ల ఆదాయం ఎక్సైజ్ శాఖ ఖజానాకు సమకూరింది. గత ఎక్సైజ్ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల రూపంలో రూ. 52.74 కోట్ల ఆదాయం సమకూరగా, ఈసారి అప్పటి కంటే రూ.1.50 కోట్ల ఆదాయం అదనంగా ఖజానాకు వచ్చింది. డ్రాలో మద్యం దుకాణాలు దక్కించునే వారి నుంచి లైసెన్సు ఫీజుల రూపంలో ఖజానాకు ఏడాదికి రూ.32.60 కోట్ల ఆదాయం సమకూరనుంది. జిల్లాలో మద్యం విక్రయాల ద్వారా ప్రతినెలా ఎక్సైజ్ శాఖకు రూ.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతున్న విషయం తెలిసిందే.

బోనస్ ఎప్పుడిస్తారు?

(ఐదో పేజీ తరువాయి)



డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు ఒకటి ఒకటి, రెండు రోజుల్లో జమ అయ్యాయని, బోనస్ డబ్బులు రాకపోవడంతో నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని చెబుతున్నారు.

89,210 క్వింటాళ్ల ధాన్యం సేకరణ

జిల్లాలో దాదాపు 1,200 మంది రైతుల నుంచి 89,210 క్వింటాళ్ల సన్నరకం వరి ధాన్యం సేకరించారు. దీనికి సంబంధించి డబ్బులు వెంటనే ఖాతాల్లో జమ చేసినా బోనస్ డబ్బులు మాత్రం ఎందుకు వేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో రైతులు విక్రయించిన సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో రైతులకు రూ.4.46 కోట్లు బోనస్ డబ్బులు జమ కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్కరి ఖాతాల్లో కూడా డబ్బులు జమ కాలేదని రైతులు వాపోతున్నారు. గత సీజన్‌వి ఇవ్వకుండా ఇప్పుడు విక్రయించే ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం విచిత్రంగా ఉందంటున్నారు. బోనస్‌పై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గత రబీ సీజన్‌కు సంబంధించి సన్నరకం ధాన్యంకు బోనస్ డబ్బులు జమచేయాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ విశాల ర్యాలీ



ధారూరులో ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకుల ర్యాలీ

ధారూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాల ప్రస్థానం పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం ధారూరులో ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు విశాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని వీధుల గుండా కొనసాగిన ర్యాలీ వీరభద్రేశ్వర ఆలయానికి చేరుకుంది. అనంతరం జరిగిన సంఘ సమావేశంలో జిల్లా సహ సంఘ చాలక్ గోవర్ధన్ మాట్లాడుతూ.. పంచపరివర్తన ద్వారా సమాజ నిర్మాణంలో యువకులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సేవకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఈ రోడ్లను బాగు చేయరా?



దుద్యాల: పోలెపల్లి-బట్లచందారం రోడ్డు దుస్థితి

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి నుంచి దోమ మండలంలోని బట్లచందరం గ్రామానికి వెళ్లే 4కిలో మీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. మట్టి రోడ్డు గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. బీటీ రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పోలెపల్లి గ్రామ ప్రజలు రాత్రి వేళలో పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యవసర సమయాల్లో నరకయాతన తప్పడం లేదంటున్నారు. అధికారులు స్పందించి బీటీరోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పూడూరు: మండల పరిధిలోని కంకల్-అంగడిచిట్టింపల్లి గేట్, కంకల్-లాల్పహాడ్ ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైందని బీజేపీ జిల్లా ఐటీ ఇన్‌చార్జి, మైభారత్ జిల్లా కన్వీనర్ రవీందర్ కంకల్, మై భారత్ బ్లాక్ పూడూరు మండల ఇన్‌చార్జి చాకలి శ్రీశైలం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్గంలో రోడ్డుపనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు మార్గం గుండా నిత్యం భారీ వాహనాలు కూడా ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటాయని, ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తే ఏ గుంత ఎక్కడ ఉందో తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రమాదాల బారిన పడి కొందరు ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు, కంకల్‌గ్రామ సమీపంలో ఉన్న బీరు కంపెనీ యాజమాన్యం గుంతల రోడ్డుకు చింతలపల్లి వరకు మరమ్మతులు చేయించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కంకల్-రాకంచర్ల రోడ్డు పరిస్థితి కూడా దారుణంగా తయారైందన్నారు. నాలుగు చోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని అన్నారు. గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోతే త్వరలోనే ధర్నా చేపడతామని రవీందర్ కంకల్, శ్రీశైలం హెచ్చరించారు.



కంకల్-అంగడిచిట్టెంపల్లి గేట్ రోడ్డుపై పడిన గుంతలు

క్రైం కార్నర్

నీటిగుంతలో పడి ఇద్దరు విద్యార్థినుల మృతి



విద్యార్థినుల మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పశువులను మేత కోసం తీసుకెళ్లిన విద్యార్థినులు ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృతి చెందారు. ఈ సంఘటన మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంకుశాపూర్‌కు చెందిన కొండల మల్లేష్ తన భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకుతో కలిసి ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఉంటూ వ్యవసాయం చేస్తూ పశువులను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఆదివారం మల్లేష్ పని నిమిత్తం బయటకు వెళ్లడంతో పశువులను మేతకోసం ఇద్దరు కూతుళ్లు ఇంటర్ చదువుతున్న హరిణి(16), 9వ తరగతి చదువుతున్న గాయత్రి(13) తీసుకెళ్లారు. పశువులకు నీళ్లను తాపడానికి ఎన్ఎఫ్‌సీ నగర్ ప్రశాంత్‌నగర్ సమీపంలోని నీటిగుంత వరకు వెళ్లారు. అనంతరం ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిగుంతలో పడ్డారు. రాత్రి వరకూ ఇద్దరు కూతుళ్లు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నీటి గుంతగడ్డపై వారి చెప్పులు, చున్నీని గమనించి జిల్లా విపత్తులశాఖ అధికారులను రప్పించి గుంతలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. మరో పోలీసు బృందం యాదగిరిగుట్ట, విజయవాడ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు గంటలు శ్రమించి చివరికి ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలను బయటకు తీశారు. తన ఇద్దరు పిల్లల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలస్వామి తెలిపారు.

ఆరో అంతస్తు నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

కీసర రూరల్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ముగ్గురి మధ్య జరిగిన గొడవతో మనస్తాపానికి గురై ఓవ్యక్తి ఆరో అంతస్తు నుంచి దూకి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విష్ణువర్ధన్(20), నర్సింగ్‌రావు, హరి అనే ముగ్గురు వ్యక్తులు వారి కుటుంబాలతో కలిసి దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో నివాసముంటున్నారు. ఉన్నట్టుండి శనివారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన విష్ణువర్ధన్ శనివారం అర్ధరాత్రి 2గంటల సమయంలో తాను నివాసముంటున్న భవనంలోని ఆరో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తీవ్ర గాయాల పాలైన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలు మేకల చోరీ

పెద్దేముల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు మేకలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శనివారం గాజీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామానికి చెందిన హరిజన్ జీవప్ప నాలుగు మేకలను పెంచుకున్నాడు. ఆయన భార్య బాలమణి గ్రామ సమీపంలోని పట్టుపరిశ్రమలో కూలీపనులకు వెళ్తూ వాటిని వెంటతీసుకెళ్లి అక్కడ తాడుతో కట్టేసి మేత వేస్తుండేది. రోజూలాగే శనివారం మేకలను పట్టుపరిశ్రమకు తీసుకెళ్లి అక్కడే కట్టేసింది. మధ్యాహ్నం మేకలకు నీళ్ల పెడదామని వెళ్లి చూస్తే అక్కడ మేకలు లేవు. చుట్టుపక్కల వెతకగా పట్టుపరిశ్రమకు ఏర్పాటుచేసిన జాలిఫెన్సింగ్ ఓ చోట తెగిపోయి ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు అక్కడికి ఓ వాహనం తీసుకొవచ్చి మేకలను చోరీచేసినట్లుగా ఆనవాళ్లను గుర్తించారు. వెంటనే గ్రామస్తులకు విషయం తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాజీపూర్‌లో జరుగుతున్న వరుసచోరీలతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

- పరిస్థితి విషమం

పెద్దేముల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మన్‌సాన్‌పల్లిలో ఆదివారం ఉదయం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన ముడావత్ శ్రీనివాస్(27) ఉదయం తన వ్యవసాయ పొలానికి వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. రెండు చెవులలోనుండి రక్తం కారుతుండడంతో వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడిని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న తుంకి రమేశ్

శామీర్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని పూర్తిచేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఆదివారం దళిత సమాఖ్య నాయకులు రాష్ట్ర ఎస్సీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలసి విన్నవించారు. శామీర్‌పేట మండల కార్యాలయ సమీపంలో మండల దళిత సమాఖ్య అధ్వర్యంలో గతేడాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని మొదలుపెట్టారు. కాగా ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నిధులు లేక నిర్మాణపనులు ఆగిపోయాయి. ఈ సందర్భంగా ఆదివారం శామీర్‌పేట మండల దళిత సమాఖ్య అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, దళిత సమాఖ్య నాయకులు కలిసి నగరంలోని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. శామీర్‌పేటలోని పెండింగ్‌లో ఉన్న అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను పూర్తి చేయడానికి అంచనా ప్రకారం మరో రూ.25లక్షలు అవసరమవుతాయని, ఈ నిధులను ప్రభుత్వం నుంచి వెంటనే మంజూరి చేయడానికి చొరవ తీసుకోవాలని వారు మంత్రికి విన్నవించారు. సాధ్యమైనంత త్వరగా ఆ నిధులను మంజూరు చేయించి దళిత సమాఖ్యకు చేయూతనివ్వాలని వారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరారు. మంత్రి మాట్లాడుతూ.. నిధుల మంజూరీకి తగు చర్యలను తీసుకుంటానని మండల దళిత సమాక్య నాయకులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మండల దళిత సమాఖ్య నాయకులు ఊరడి వెంకటేశ్, కొమ్ము వినోద్, మునికొండ నవీన్, పిట్ల నర్సింలు పాల్గొన్నారు.